

మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


# వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

### రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 27 ప్రభాతవార్త:** తాడూర్ మండల పరిధిలోని ఐతోల్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. సన్నరకం వరికి రూ.500ల బోనస్ ఇవ్వాలన్నారు. ఎంత ధాన్యం కేంద్రానికి వచ్చిందని ఆరా తీశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం కల్పించిన అన్ని వసతులను కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళా సంఘాల ద్వారా ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంలో వరి కొనుగోలు ప్రక్రియల రికార్డులను పరిశీలించారు. రైతులకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు ప్రక్రియను చేపట్టిన 48 గంటల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేసి వెంటనే రైతుల వివరాలను ఆన్‌లైన్ అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. రైతుల నుండి ఎలాంటి ఫిర్యాదులు అందకుండా కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, వరి కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాస రావు

# చిన భీమరాయుడిది హత్యే

### వాస్తవాలను వెల్లడించిన పోలీసులు...

### మాజీ సర్పంచ్ హత్య కేసులో

### ప్రధాన నిందితులు పది మంది అరెస్టు...

### నిందితుల నుంచి రూ.8.50లక్షలు, 4కార్లు,

### 1 బొలేరో, 2బైక్‌లు, 11 మొబైల్ స్వాధీనం...

**గద్వాల టౌన్, నవంబర్ 27, ప్రభాతవార్త:** గత వారం క్రితం ధరూర్ మండలం జాంపల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నందిన్నె మాజీ చిన సర్పంచ్ భీమరాయుడు మృతి చెందగా ఈ ప్రమాదంపై పలు అనుమానాలు రేకెత్తించాయి. ఇది ప్రమాదం కాదని భీమరాయుడిని చంపాలని పథకం ప్రకారం ప్రమాదంగా చిత్రీకరించారని భీమరాయుడుది మృతి హత్యే అని పోలీసులు తేల్చేశారు. గురువారం ఈ కేసుపై జిల్లా కేంద్రంలో గల ప్రధాన పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఎస్పీ శ్రీనివాస రావు హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ హత్య కేసులో మిల్లు వీరన్న ప్రధాన నిందితుడిని, భీమ రాయుడునికి, వీరన్నకు వున్న భూ తగాదాలే హత్యకు దారితీసాయి అన్నారు. కర్నూల్ కు చెందిన వారితో 25 లక్షలకు సఫారీ మాట్లాడుకొని బులేరో వాహనం తో భీమ రాయుడు ప్రయాణిస్తున్న ద్వి చక్ర వాహనాన్ని డి కొట్టించి హత్య చేయించారని తెలిపారు. కేటిదొడ్డి మండలం నందిన్నె గ్రామ మాజీ సర్పంచ్ చిన్న భీమరాయుడు హత్య కేసులో ప్రధాన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుల – మిగతా3లో..



ఎన్నికల అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ సునీత రెడ్డి

### శాంతిభద్రతలపై

# కఠిన పర్యవేక్షణ...!!

### బందోబస్తు పటిష్ఠం, సమస్యాత్మక గ్రామంపై ప్రత్యేక నిఘా

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

### శాంతిభద్రతల విషయంలో

### ఎలాంటి రాజీ లేదు కఠినంగా వ్యవహరిస్తాం

### నామినేషన్ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**వనపర్తి, నవంబరు 27 ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల మొదటి విడత నామినేషన్ల దృష్ట్యా గోపాల్‌పేట్, మండలంలోని గోపాల్ పేట్, తాడిపత్రి, గ్రామపంచాయతీలు, ఎదుల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎదుల గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్, పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ సునితరెడ్డి, ఆకస్మికంగా పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల్లో –మిగతా4లో..



అన్నాసాగర్‌లో వరి రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి

# వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఆకస్మికంగా తనిఖీ

### - రైతులకు ఎలాంటి ఇబ్బంధులు

### కల్గకుండా చర్యలు తీసుకోవాలని నిర్వహకులకు ఆదేశం

**భూత్పూర్,నవంబర్ 27,ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి భూత్పూర్,మూసాపేట మండలాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.భూత్పూర్ మండలంలోని అన్నాసాగర్‌లోను,మూసాపేట మండలం పోల్కంపల్లిలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ విజయేంద్రబోయి తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ నిర్ణీత నాణ్యత ప్రమాణాలు కల్గిన ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని – మిగతా4లో..

### గ్రామాల్లో జీపీ ఎన్నికల

# హడావుడి



- ◆ స్థానిక పోరుకు సన్నద్ధం
- ◆ రిజర్వేషన్లు ఖరారు కావడంతో పావులు కదుపుతున్న స్థానిక నేతలు
- ◆ పరోక్షంగా పార్టీల మద్దతు కోరుతున్న ఆశావహులు
- ◆ గ్రామాల్లో వార్డు,సర్పంచు అభ్యర్థుల హల్‌చల్

**భూత్పూర్,నవంబర్ 27,ప్రభాతవార్త :** వచ్చే నెలలో స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ మంగళవారం వెలువడిన నేపథ్యంలో గ్రామాల్లో సర్పంచులు,వార్డు సభ్యుల పదవులనాశించే స్థానిక నాయకులు హల్‌చల్ చేస్తూ పదవుల కోసం ఆరాటపడుతున్నారు.స్థానిక ఎన్నికలకుసర్పంచులు, వార్డు సభ్యుల పదవుల కోసం రిజర్వేషన్లు ఇంచుమించు ఖరారు కావడంతో పదవులనాశించే స్థానిక నాయకులు తమ అధినేతలతో పావులు కదుపుతున్నారు.ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రు.10లక్షల పోత్సాహకం అందిస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించిన నేపథ్యంలో వచ్చే నిధులతో తమ గ్రామాలను అభివృద్ధి చేయవచ్చనే భావనతో ఆయా గ్రామాల్లో పంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు స్థానిక నేతలు అవిరళ కృషి చేస్తున్నారు.ఉమ్మడి పాలమూరు జిల్లాల సర్పంచు స్థానాలను పరిశీలిస్తే మహబూబ్‌నగర్ -441, నాగర్‌కర్నూల్-461,నారాయణపేట-280,వనపర్తి-268,జోగళాంబ గద్వాల-255లకు ఎన్నికలు జరుగనున్నాయి.ఒక్కో పంచాయ తికి 10నుంచి 15వరకు వార్డు సభ్యులుంటారు.

**భూత్పూర్ మండలంలో 19జీపీలు,174వార్డులకు ఎన్నికలు**

భూత్పూర్ మండలంలోని 19గ్రామ పంచాయతీలలో 174వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందులో 98వార్డులు జనరల్‌కు కాగా, 76వార్డులు వివిధ కేటగిరిలకు సంబంధించి మహిళలకు రిజర్వేషన్ కల్పించారు.2011 జనాభా ప్రాతిపదికన ఎస్సీ,ఎస్టీల రిజర్వేషన్, 2024 సామాజిక సర్వే ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు.రిజర్వేషన్ల ప్రకారం 13స్థానాలు ఎస్టీ(మహిళ),14స్థానాలు,ఎస్టీ(జనరల్),12స్థానాలు ఎస్సీ(మహిళ),19స్థానాలు ఎసీ (జనరల్), 16స్థానాలు బీసీ(మహిళ),24స్థానాలు బీసీ(జనరల్)లకు కేటాయించారు. ఇవికాకుండా అన్ రిజర్వుడ్(మహిళ)కు 35వార్డులు,జనరల్‌కు 41స్థానాలు రిజర్వుఅయ్యాయి.

**19 సర్పంచుల పదవులకు ఎన్నికలు:**

జనాభా ప్రాతిపదికన సర్పంచులు,వార్డు మెంబర్లు రిజర్వేన్లు ఖరారు కావడంతో ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావహులు తహతహలాడు తున్నారు..భూత్పూర్ మండలంలోని 19గ్రామపంచాయతీల సర్పంచులకు వచ్చే నెలలో ఎన్నికలు నిర్వహించనున్నారు.భూత్పూర్ మండలంలో రిజర్వేషన్లను ఒక్కసారి పరిశీలిస్తే తాటిపర్తి(జనరల్),కొత్తూరు(బీసీ-మహిళ),కరివెన(బీసీ-మహిళ), వెల్కిచర్ల(బీసీ-జనరల్),భట్టుపల్లి (ఓసీ-జనరల్), మద్దిగట (ఎస్సీ- జనరల్), కప్పెట(బీసీ-జనరల్),కొత్తమొల్గర(ఓసీ-జనరల్),పోతులమడుగు(ఓసీ-జనరల్),అన్నాసాగం (ఓసీ- జనరల్),రావులపల్లి (బీసీ-జనరల్), శేర్పల్లి హెచ్(ఎస్సీ-మహిళ),హస్నాపూర్(ఓసీ-జనరల్),తాటికొండ(ఓసీ-మహిళ),పాతమొల్గం (ఎస్సీ- జనరల్),పెద్దతండా(ఎస్టీ-మహిళ),లంబడి కుంట తండా(ఎస్టీ-జనరల్),ఏవీఆర్ తండా(ఎస్టీ-జనరల్),చౌలతండా (జనరల్-మహిళ)కు రిజర్వు అయ్యాయి.దీంతో ఆయా స్థానాలలో తమకు – మిగతా4లో..



సీఐతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

### కాంగ్రెస్ నేత ఓవరాక్షన్..

# ఎమ్మెల్యే జిఎంఆర్ ఇంటరాక్షన్

### జడ్చర్ల పోలీస్ స్టేషన్

### కేంద్రంగా రచ్చ జిల్లా వ్యాప్తంగా చర్చ

**జడ్చర్ల,నవంబరు 27 ప్రభాతవార్త :** ఓ కాంగ్రెస్ నేత చేసిన ఓవర్ యాక్షన్ జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. జడ్చర్ల పోలీస్‌స్టేషన్ వేదికగా కాంగ్రెస్ నేతల దౌర్జన్యం కలకలం రేపింది. భూత్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఓ యాక్సిడెంట్ కేసు విషయంలో మాట్లాడేందుకు పోలీస్ స్టేషన్ చేరుకున్నారు. రాజీ కుదరకపోవడంతో ఆగ్రహంతో పోలీసుల పైనే దురుసుగా ప్రవర్తిస్తూ దాడికి యత్నించాడు.యాక్సిడెంట్ కేసు చర్చల మధ్య శ్రీనివాస్ రెడ్డి విధుల్లో ఉన్న కానిస్టేబుల్ భీమయ్యను గల్లా పట్టి దురుసుగా ప్రవర్తించడంతో పాటు మరో కానిస్టేబుల్ లక్ష్మప్పను పక్కకు తోసేసాడు. పోలీస్ స్టేషన్‌లోనే ఉన్న ఎస్సై జయప్రసాద్ వారించడానికి ప్రయత్నించగా అతనిపై దౌర్జన్యంగా మాట్లాడి, బెదిరింపులకు పాల్పడ్డారు అని ఎస్సైపై దాడి చేయడానికి కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్సై స్వయంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడిని లాకప్‌లో పెట్టారు. సమాచారం తెలుసుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ మధుసూదన్ రెడ్డి హుటాహుటిన జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఘటనపై వివరాలు ఆరా తీశారు. ఘటనలో ఎవరి – మిగతా4లో..

**సిసి ఫుటేజీ బయట పెట్టండి : కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి**

బురెడ్డిపల్లి వద్ద జరిగిన యాక్సిడెంట్‌కు సంబంధించి కారు పెద్ద మొత్తంలో డ్యామేజీ అయింది. ఆ కేసుకు సం బంధించి బాధితులు గత 10 రోజులుగా స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. నేను కూడా మూడు నాలుగు సార్లు స్టేషన్‌కు వచ్చి కేసు వివరాలు ఆరా తీశాను. గురువారం స్టేషన్‌లో నేను ఎస్ఐని ఒక్కమాట కూడా అనలేదు.తానే నన్ను ఇష్టమున్న బూతులు తిట్టాడు గల్ల పట్టుకున్నారు.స్టేషన్లో జరిగిన మొత్తం తతంగానికి సంబంధించి ఫుల్ ఫుటేజ్‌ని విడుదల చేయండి నేను తప్పుచేయలేదు. ఆ కేసులో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు.



నామినేషన్ వేస్తున్న మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్

### నామినేషన్‌లో

# పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి

**వెల్దండ, నవంబర్ 27 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని సర్పంచ్ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. వెల్దండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సింగిల్ విండో డైరెక్టర్ మట్ట యాదమ్మ వెంకటయ్యగౌడ్ నామినేషన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని మొదటగా బుధవార్‌పేట ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామపంచాయతీ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి ఎమ్మెల్యేతో కలిసి సర్పంచ్ అభ్యర్థి యాదమ్మ వెంకటయ్య గౌడ్ అందజేశారు. మండలంలో మొదటి రోజు సర్పంచు అభ్యర్థులు 19 మంది, వార్డు సభ్యులు 17 మంది నామినేషన్ వేసినట్లు ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా సంజీవ్‌యాదవ్, సురేందర్ రెడ్డి, కృష్ణ ముదిరాజ్, రషీద్, ఎర్ర శ్రీను ముదిరాజ్, రమేష్, పురుషోత్తంచారి, భరత్‌గౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

# లక్ష్యంతో శ్రమించాలి

### జిల్లాకు గర్వకారణంగా నిలవాలి

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

### ఎప్సెట్, నీట్ స్టడీ మెటీరియల్స్ పంపిణీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 27 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు ఉన్నత విద్యలో రాణించే అవకాశాలను చేరువ చేసేందుకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కీలక ముందడుగు వేశారు. ఎప్సెట్ మరియు నీట్ వంటి ప్రతిష్ఠాత్మక ఎంట్రెన్స్ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్స్‌ను విద్యార్థినులకు అందజేసి వారి భవిష్యత్తుకు బలమైన మార్గదర్శనం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యే ఏ సమాజానికైనా పునాదిగా నిలుస్తుంది. ముఖ్యంగా ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా సరైన మార్గనిర్దేశం, కష్టపడి చదివే తత్వం ఉంటే ఏ ప్రైవేట్ విద్యార్థులకు తీసిపోని స్థాయిలో విజయాలు సాధించగలరు. గత సంవత్సరం ఫలితాల కంటే ఈసారి మరింత మెరుగైన ర్యాంకులు సాధించి మహబూబ్‌నగర్ జిల్లాకు గర్వకారణంగా నిలవాలి" అని పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో పయనీర్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న ఈస్టడీ మెటీరియల్స్ సౌకర్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకుని, లక్ష్యంపై స్పష్టతతో నిరంతరంగా శ్రమించాలని, క్రమశిక్షణతో చదివితే విజయాలు తప్పనిసరిగా మిమ్మల్ని వరిస్తాయని వివరించారు. ఈ స్టడీ మెటీరియల్స్ విద్యార్థినులకు కేవలం పుస్తకాలు కాకుండా, వారి కలలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అలాగే బాలికల విద్యాభివృద్ధే సమాజ అభివృద్ధికి మూలమని పేర్కొంటూ, మహిళలు అన్నిరంగాల్లో ముందంజలో నిలవాలంటే సరైన విద్య, ఆత్మవిశ్వాసం అవసరమని స్పష్టం చేశారు. ప్రతిభను నిరూపించి ఉన్నత చదువుల్లో ప్రవేశం పొందుతూ వైద్య, ఇంజనీరింగ్ రంగాల్లో సత్తా చాటాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, కళాశాల ప్రిన్సిపాల్ డా. కౌసర్ జహాన్, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



విద్యార్థులతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

### టీ పోల్ మొబైల్ యాప్‌ను ప్రతి ఓటరు

# వినియోగించుకోవాలి

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణ పేట, నవంబరు 27 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లకు సులభంగా ఎన్నికల సమాచారం అందించేందుకు రూపొందించిన టీ పోల్ మొబైల్ యాప్ ఇప్పుడు గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రకటించారు. ఈ యాప్ ద్వారా ఓటర్లు తమ పోలింగ్ కేంద్ర వివరాలు, ఓటర్ స్లిప్‌కు సంబంధించిన సమాచారం సులభంగా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఓటరు ఈ యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకొని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ యాప్‌ను విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను ఉపయోగించి ఓటింగ్‌లో చురుకుగా పాల్గొనాలని ప్రకటనలో పేర్కొన్నారు.



జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

# కొలిక్కిరాని అభ్యర్థుల ఎంపిక

- ◆ హస్తం పార్టీలో అంతర్గత విభేదాలు తొలిగేనా...?
- ◆ ప్రారంభమైన నామినేషన్ల పర్వం ...
- ◆ సీఎం సొంత మండలంలో ఏకగ్రీవాలు జరిగేనా...?
- ◆ అయోమయంలో ఆశావాహులు



**వంగూరు, నవంబరు 27 ప్రభాతవార్త:** స్థానిక ఎన్నికలకు ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చి షెడ్యూల్ విడుదల చేసినప్పటికీ గురువారం నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఆశావాహులు తమ గ్రామంలో వచ్చిన రిజర్వేషన్ల ప్రకారంగా మేమే బరిలో ఉండి గ్రామ ప్రథమ పౌరుడిగా గ్రామ ప్రజలకు సేవలందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న తరుణంలో గ్రామాలలో సమన్వయం లేకపోవడం వలన అభ్యర్థుల ఎంపిక చేయలేక మండల నాయకులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఏ గ్రామంలో చూసిన గతంలో నుంచి కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాలు ఏర్పడి విభేదాలతో కొనసాగుతూ వచ్చింది. కానీ గతంలో కాంగ్రెస్ పార్టీలో ఏ గ్రామంలో అయినా కార్యకర్తలు నాయకుల మధ్య విభేదాలు ఏర్పడితే వాటిని సరిచేసి ఐక్యమత్యంగా ఉంచేందుకు ఆనాటి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులతో కలిసి కృషి చేసిన ఆనాటి నాయకుడు మంద పాండురంగారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.మంద పాండురంగారెడ్డి మృతి నేడు కాంగ్రెస్ పార్టీకి తీరని లోటనే చెప్పుకోవచ్చు. స్థానిక ఎన్నికల సమరంలో అభ్యర్థులను ఎంపిక చేసి ఎలాంటి విభేదాలు ఉన్న వాటిని పరిష్కరించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన నాయకుడు లేకపోవడంతో కాంగ్రెస్‌పార్టీలో ఏర్పడిన విభేదాలను పరిష్కరిం చి ఏకతాటిపై తీసుకొచ్చి అభ్యర్థులను ఎంపిక చేసి బరిలో నిలిపేందుకు నేటి నాయకులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని చెప్పుకోవచ్చు. వంగూరు మండలంలో మొదటివిడతలో స్థానిక ఎన్నికలు నిర్వహించనున్నారు. అయితే గురువారం ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయాల్సి ఉండగా హస్తం పార్టీ మాత్రం అభ్యర్థుల ఎంపికను ఖరారు చేయడంలో విఫలమయ్యారనే చెప్పుకోవచ్చు. ఇది ఇలా ఉంటే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత మండలం కావడంతో ఈ మండలంలో 27 గ్రామపంచాయతీలలో బరిలో నిలవాల్సిన అభ్యర్థులు ఏకగ్రీవమైతే మండల అభివృద్ధి సాఫీగా సాగుతుందని ఎలాగైనా ఏకగ్రీవాలకే ప్రాధాన్యతను కల్పించి, ఏకగ్రీవాలకే ముగ్గు చూపాలన్న ఆనాటి మాటలు నిజం చేసి ఏకగ్రీవాలు చేస్తారా అన్న సందేహాలు లేకపోలేదు. అధికార పార్టీ అంశతో బరిలో నిలవనున్న సర్పంచ్ అభ్యర్థులను గెలిపిస్తే గత పాలకుల పాలనలో అభివృద్ధికి నోచుకోని గ్రామాలను అభివృద్ధి పరిచి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలనుకుంటున్న ఆశావాహులకు కాంగ్రెస్ పార్టీ నేటికి కూడా అభ్యర్థుల ఎంపిక చేయకపోవడంతో కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో నిలవాల్సిన ఆశావాహులు అయోమయంలో పడ్డారని చెప్పుకోవచ్చు. కొన్ని గ్రామాలలో అధికార పార్టీ ఏ అభ్యర్థిని ఎంపిక చేసిన మేము సైతం బరిలో నిలిచి మా సత్తా ఏంటో చూపిస్తామని కాంగ్రెస్ రెబల్‌గా లేదా స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసి బరిలో నిలిచేందుకు మరికొందరు సిద్ధమవుతున్నారు. వంగూరు మండలంలో హస్తం పార్టీలో ఎవరికి వారే యమునా తీరు అన్నట్లుగా నామినేషన్ దాఖలు వేసేందుకు సిద్ధమవుతూ సొంత పార్టీ అభ్యర్థులను ఓడించేందుకు కంకణం కట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాంగ్రెస్ పార్టీకి కనీసం మండల అధ్యక్షులు ఉన్న కార్యకర్తల్లో నెలకొన్న అసమ్మతి సెగలను నిలువరించి అభ్యర్థుల ఎంపికలు ఎలాంటి విభేదాలు లేకుండా సాగుతుండే అన్న గుసగుసలు చర్చలు లేకపోలేదు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వంగూరు మండలంలో మాత్రం కాంగ్రెస్ పార్టీని నడిపించే సరైన నాయకుడు లేనందుకే అభ్యర్థుల ఎంపికలో ఆటంకాలు ఎదురావుతున్నాయానే చెప్పుకోవచ్చు. స్థానిక సమరంలో గెలిచే అభ్యర్థులను ఎంపిక చేసి బరిలో దించుతారా... లేక మొక్కుబడిగా ఎంపిక చేస్తారో చూడాల్సిందే.

## అపర తిరుపతి మల్దకల్ క్షేత్రం

**శ్రీవిశ్వ వల్లభ తీర్థులు**



స్వామివారిని దర్శించుకుంటున్న శ్రీ విశ్వ వల్లభ తీర్థులు

**గద్వాలటౌన్,నవంబర్27, ప్రభాతవార్త:** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అపర తిరుపతిగా విలసిల్లుతున్నదనీ శ్రీమన్ మధ్వాచార్య పూల మహాసంస్థానం సోది రాజ మఠాధితులు పరమ పూజ్య శ్రీ శ్రీ విశ్వ వల్లభ తీర్థులు అన్నారు. గురువారం మల్దకల్ శ్రీ తిమ్మప్ప స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరైన స్వామీజీకి ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు ఈవో సత్య చంద్రారెడ్డి అర్చకులు భక్తులు పూర్ణకుంభం స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ భక్తులకు అనుగ్రహం చేసి వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా దేవాలయ నిర్వాహకులు స్వామీజీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్వారి అరవిందరావు చంద్రశేఖర రావు మధుసూదనాచారి రమేష్ అనిల్ పట్వారి శ్రీకాంత్ బాబురావు రవి తదితరులు పాల్గొన్నారు.

## విధ్వంస, ప్రేరేపిత వాక్యాలు
## వాట్సప్ గ్రూపులలో షేర్ చేయరాదు



ఎస్ ఐ కే.రవి

**ఇటిక్యాల నవంబర్ 27, ప్రభాతవార్త:** విధ్వంస ప్రేరేపిత వాక్యాలు నాయకులు పార్టీల గురించి వాట్సప్ గ్రూపులలో పోస్టులు.షేర్ చేయరాదని అలా చేసినట్లయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాట్సప్ అడ్మిన్ దారులు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై కే. రవి సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. అనవసరమైన వివాదాస్పదమైన మతపరమైన వ్యక్తిగతంగా ఇబ్బందులు కలిగించే విషయాలను వాట్సాప్ గ్రూపులలో ఫార్వర్డ్ చేసి అనవసరమైన సమస్యలను కొని తెచ్చుకోవద్దని పోలీస్ కేసుల పాలు కావద్దని అదేవిధంగా గ్రూపులలో అనవసర విషయాలు ఫార్వార్డ్ అయిన వెంటనే గ్రూప్ అడ్మిన్ ఉన్నవారు తక్షణమే వాటిని తొలగిస్తే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. దీంతో వాట్సప్ గ్రూపులు. నిర్వహిస్తున్న వారితోపాటు. గ్రూప్ అడ్మిన్ గా ఉన్నవారు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని ఎన్నికల కోడ్ నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్ ఐ. కే.రవి గ్రూప్ అడ్మిన్ దారులకు సూచించారు.

## మానవతకు నిలువెత్తు నిదర్శనం

**అనాథ చిన్నారులకు 1998 బ్యాచ్ తోడు**



చిన్నారులకు ఆర్థిక సాయం చేస్తున్న దృశ్యం

**ధన్వాడ, నవంబరు 27 ప్రభాతవార్త :** మానవీయ విలువలు ఇంకా బ్రతికే ఉన్నాయని నిరూపిస్తూ ధన్వాడ మండల కేంద్రానికి చెందిన 1998 బ్యాచ్ మిత్రులు ఆదర్శప్రాయ నిర్ణయం తీసుకున్నారు. రెండు నెలల క్రితం అనారోగ్య కారణంగా మరణించిన మంగలి విజయలక్ష్మీ ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలిన విషయం తెలిసిందే. ప్రస్తుతం తాతతో కలిసి జీవిస్తున్న ఈ చిన్నారుల భవిష్యత్తు కోసం బ్యాచ్ మిత్రులు ముందడుగు వేశారు. చదువుతో కలిసి పెరిగిన స్నేహాన్ని నిలబెడుతూ 1998 బ్యాచ్ స్నేహితులు నిధుల సేకరణ జరిపి రూ.37,600 సాయం అందించారు. ఈ మొత్తాన్ని చిన్నారుల తాతకు అందజేస్తూ, వీరి విద్య కొనసాగింపునకు భవిష్యత్తులో కూడా పూర్తి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.మానవత్వాన్ని మరిచిపోని స్నేహబంధం అవసర సమయంలో అండగా నిలబడటమే నిజమైన స్నేహమని 1998 బ్యాచ్ మరోసారి నిరూపించింది. గ్రామస్థులు, ఆత్మీయ బంధువులు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తున్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**నారాయణపేట, నవంబరు 27 ప్రభాతవార్త:** నారాయణపేట మండలంలోని శ్యాసన్‌పల్లి గ్రామంలో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత చిన్నపిల్లల వైద్య నిపుణులు డా.సునీధి గందె, జనరల్ ఫిజీషియన్ డా.కార్తీక్ గందె పర్యవేక్షణలో మధుమేహ పరీక్షలు, చిన్నపిల్లల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి 400 మందికి పైగా ప్రజలకు ఉచిత వైద్యం అందించారు. అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు సరిత హరి నారాయణ్ బట్టడ్ మాట్లాడుతూ "సేవా భావంతోనే పరమార్థం. సమాజంలోని పేదల సంక్షేమం కోసం లయన్స్ క్లబ్ నిరంతరం కృషి చేస్తోంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హరి నారాయణ్ భట్టడ్, కార్యదర్శి సాయినాథ్, కోశాధికారి రాధ సదానంద్ చారి, ఆత్మారాం, ఏడీకే జోన్ చైర్మన్ ఉమాకాంత్ గందె, జనార్ధన్, వెంకటయ్య, సురేందర్ చారి తదితరులు పాల్గొన్నారు.


## దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

**నారాయణ పేట, నవంబరు 27 ప్రభాతవార్త :** నారాయణపేట బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన సన్నాహక, సమీక్షా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్. రాజేందర్ రెడ్డి పాల్గొని సమావేశానికి నేతృత్వం వహించారు. ఈ సమావేశంలో రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ 29 దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలి అన్ని దీక్షా దివస్ కార్యక్రమం పార్టీకి ఎంతో ప్రతిష్టాత్మకం ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రజల్లో నిజాలను చేరవేయడంతో పాటు, బీఆర్‌ఎస్ పార్టీ తీరును బలోపేతం చేసే సందేశాన్ని ఇవ్వాలన్నారు. అందుకోసం ప్రతి మండలం నుంచి కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే నవంబర్ 29న నిర్వహించాల్సిన కార్యక్రమం వ్యవస్థాపనలు, కార్యాచరణ, మైదాన ఏర్పాట్లు,కార్యకర్తల రవాణా,ప్రతి విభాగం బాధ్యతలను నేతలు సమన్వయంతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమం నిర్వహణలో ఏ చిన్న లోపం లేకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. దీక్షా దివస్ మన ఐక్యతను, మన పోరాట స్ఫూర్తిని ప్రజలకు చూపించే వేదిక. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు పార్టీ ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యువజన విభాగం, రైతు విభాగం నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

## రాష్ట్ర జూనియర్ టెన్నికాయిడ్
## క్రీడలలో ప్రతిభను చాటిన మక్తల్ విద్యార్థి సమత



మెడల్ సాధించిన విద్యార్థినిని సన్మానిస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, నవంబరు 27 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ఆదేశాల మేరకు వరంగల్ హనుమకొండ జిల్లా టెన్నికాయిట్( రింగ్ బాల్) అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుండి 21వరకు వరంగల్ హనుమకొండ ఐడిఎల్ పాఠశాలలో జరిగిన 9వ రాష్ట్రస్థాయి జూనియర్ టెన్నికాయిట్ పోటీలలో మక్తల్ పట్టణంలోని ఆజాద్ నగర్‌కు చెందిన మేదరి సమత తెలంగాణ నుండి 58 మంది బాలికలు పాల్గొన్న జూనియర్ టెనికైట్ క్రీడలలో పాల్గొని, క్రీడా ప్రతిభను చాటి జూనియర్‌పోటీలలో సమత 5వస్థానం పొంది మెడల్,ప్రశంసా పత్రము పొందినట్లు తండ్రి మేదరిశంకర్ సంతోషాన్ని వ్యక్త పరుస్తూ తెలిపారు.ప్రస్తుతం మేదరి సమత కృష్ణవేణి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నది. ఈ నెల 27న తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోచ్ బి.గోపాలం పాఠశాలలో మేదరి సమతకు మెడల్, సర్టిఫికెట్ అందజేసి ఘనంగా సన్మానించి అభినందించారు. బి.గోపాలం మాట్లాడుతూ సమత గతంలో మహబూబ్‌నగర్ వాలీబాల్ అకాడమీకి ఎంపికై , అక్కడి పరిస్థితులు నచ్చక వదిలేసి వచ్చిందని, భవిష్యత్తులో జాతీయస్థాయి క్రీడాకారిణిగా ఎదుగుతుందని ఆయన తెలిపారు. క్రీడల వలన సంపూర్ణ ఆరోగ్యము సమాజంలో గౌరవం ఉంటుందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను క్రీడల వైపు మళ్ళించాలని ఆయన తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెన్స్ తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి, పిఈటి వెంకటేష్, ఉపాధ్యాయ బృందము, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలను నిర్మూలించడం ప్రతి పౌరుడి బాధ్యత

**అమ్మాయిలను చదువుకోనిస్తే ఉన్నత స్థాయిలో స్థిరపడడానికి అవకాశం**

**చిన్నారులపైన వేధింపుల సమాచారం తెలిస్తే 1098 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నెంబర్ సమాచారం ఇవ్వండి**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

**వనపర్తి, నవంబరు 27 ప్రభాతవార్త:** బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, కాబట్టి బాల్య వివాహాలను ఎవరు ప్రోత్సహించకూడదని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన "బాల్య వివాహ ముక్త్ భారత్" అనే కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నవంబర్ 27వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు 100 రోజుల పాటు ఈ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు ఆర్డీఎస్ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాలను నిర్మూలించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. బాల్యవివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం అమ్మాయిలకు 18 సంవత్సరాలు నిండకుండా పెళ్లి చేయడం నేరమని చెప్పారు. బాల్య వివాహాల చట్టం ప్రకారం బాల్యవివాహాలను చేస్తే తల్లిదండ్రుల పైనే కాకుండా వివాహానికి హాజరైన వారు, ప్రోత్సహించిన వారు కూడా శిక్షార్హులని తెలియజేశారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు గాని చిన్నారుల పైన వేధింపులు గాని సమాచారం తెలిస్తే 1098 టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్ కు కాల్ చేసి సమాచారం తెలియజేయాలని విద్యార్థినిలకు సూచించారు. అమ్మాయిలను బాగా చదువుకోనిస్తే జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. అలా కాదని బాల్యవివాహాలను ప్రోత్సహించి పెళ్లి చేయడం ద్వారా అమ్మాయిలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడే దిశగా అమ్మాయిలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తెలిపారు. బాల్యవివాహాలకు సంబంధించి గత ఏడాది 36 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా "స్టాప్ చైల్డ్ మ్యారేజ్" పేరుతో బాల్యవివాహాలపై చిన్నారులు రూపొందించిన పెయింట్ అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అనాధ బాలికకు ఆర్డీఎస్ తరఫున లక్ష రూపాయల స్కాలర్‌షిప్ సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. సమావేశంలో డిఆర్డిఓ ఉమాదేవి, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, డిఎంహెచ్ఓ సాయినాథ్ రెడ్డి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాంబాబు, ఆర్డీఎస్ ప్రతినిధులు, తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల చదువులకు అండగా అవోపా సంఘం

**అవోపా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మలిపెద్ద శంకర్**



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

**కల్వకుర్తి, నవంబర్ 27 ప్రభాతవార్త:** అవోపా సంఘం పేద విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా ఉంటుందని, అదే కాకుండా వాసవి ఎడ్యుకేషన్ ట్రస్ట్ ద్వారా ఉమ్మడి జిల్లాలో రూ.3 కోట్ల నిధులు సమకూర్చి ప్రతి సంవత్సరం సుమారు వంద మందికి పైగా ఉన్నత చదువులకు అండగా నిలుస్తుందని అవోప రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ద శంకర్ అన్నారు. పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఫంక్షన్ హాల్‌లో కల్వకుర్తి 2026-27 సంవత్సరానికి ఎన్నికైన నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అవోప సంఘం రాష్ట్ర అధ్యక్షులు మలిపెద్ద శంకర్ హాజరై మాట్లాడుతూ సభ్యుల సంఖ్యను పెంచాలని, సభ్యత్వం ఎంత పెరిగితే అంత పెద్ద సంఖ్యలో సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం 2026-27 సంవత్సరానికి నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడిగా కలిమిచెర్ల రాఘవేంద్రర్, ప్రధాన కార్యదర్శి యాద శోభన్‌బాబు, కోశాధికారి కల్వఆంజనేయులతో రాష్ట్ర అధ్యక్షులు మలిపెద్ద శంకర్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ మధ్యనే మృతి చెందిన ప్రకాష్ కుటుంబానికి సుమారు దాతల సహకారంతో కొంత నగదు జమచేసి బాధిత కుటుంబానికి నూతన కార్యవర్గం అందించాలని సూచించారు.ఈకార్యక్రమంలో వాసవి క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులు జూలూరి రమేష్ బాబు, వెంకటేశ్వర దేవాలయం చైర్మన్ కల్వ మనోహర్, అవోప రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొల శ్రీధర్, కోశాధికారి కందికొండ శ్రీనివాస్, రాష్ట్ర మహిళవిభాగం అధ్యక్షురాలు వందనపు శిల్ప,జోన్ చైర్మన్‌పాండు,జిల్లాఅధ్యక్షులు కోదండరాములు, అవోప జిల్లా సభ్యులు గోవిందు సుధాకర్, జిల్లా కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షులు గంధం కిరణ్ ప్రసాద్, వాస శేఖర్, లయన్ క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు శ్రీధర్, ఆర్యవైశ్య అనుబంధ సంఘాల సభ్యులు, అవోప సంఘం సభ్యులు, మహిళ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

**నవాబుపేట క్లస్టర్‌ను పరిశీలించిన ప్రత్యేక అధికారి**



నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల ప్రత్యేక అధికారి కాత్యాయని

**నవాబుపేట, నవంబరు 27 ప్రభాతవార్త :** గ్రామపంచాయతీ ఎన్నికల మొదటి దశ నామినేషన్ స్వీకరణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల ప్రత్యేక అధికారి కాత్యాయని అధికారులకు సూచించారు. గురువారం నుండి మొదలైన నామినేషన్ స్వీకరణ ప్రక్రియలో భాగంగా, నవాబుపేట పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేశారు. వీరాయిపల్లిలో కలెక్టర్‌తో పాటు ఎన్నికల జనరల్ అబ్జర్వర్, మండల అధికారులు ఎంపీడీవో జయరాం నాయక్‌తో పాటు ఇన్చార్జ్ తహసిల్దార్ మురళి, డిప్యూటీ తహసిల్దార్ సువర్ణ మండల ప్రత్యేక అధికారులు నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. నామినేషన్ స్వీకరణ విధానాలు, రికార్డుల నిర్వహణ, ఓటర్ జాబితా ప్రదర్శన వంటి అంశాలను అధికారులు సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి కాత్యాయని మాట్లాడుతూ నామినేషన్ స్వీకరణలో పూర్తి పారదర్శకత ఉండాలని, కేంద్రాల్లో ఓటర్ జాబితాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని, ఫారం1 ప్రచురణను ప్రతీ కేంద్రంలో తనిఖీ చేయాలని, ప్రతిరోజూ స్వీకరించిన నామినేషన్లను సాయంత్రం వరకు అప్డేట్ చేయాలని సూచించారు. అలాగే నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి, ఒక ప్రపోజర్, మరో వ్యక్తి మొత్తం ముగ్గురినే రిటర్నింగ్ అధికారి గదిలోకి అనుమతించాలని ఆదేశించారు. ఎక్స్‌పెండిచర్ అధికారులు మాట్లాడుతూ నామినేషన్ వేసిన అభ్యర్థులకు ఎక్స్‌పెండిచర్ బుక్‌లెట్ అందజేసేటప్పుడు దానిపై ధృవీకరణ తప్పనిసరి అని సూచించారు. ఈ కార్యక్రమంలో పి.కాత్యాయని అడిషనల్ సీఈవో సెర్ప్ రాష్ట్ర జనరల్ అబ్జర్వర్ ఇంచార్జ్ తో పాటు మండల అధికారులు, ఎంపీడీవో, తహసిల్దార్, డిప్యూటీ తహసిల్దార్ డివైఎస్ఓ, ఎంపీఓ, జిల్లా అధికారులు మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది

**- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్**




అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**నారాయణపేట, నవంబరు 27 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో బాల్య వివాహాలను సమూలంగా నిర్మూలించి, నారాయణపేటను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ - జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ప్రతి సంవత్సరం 50-60 బాల్య వివాహాలను అడ్డుకుంటున్నప్పటికీ ఇంకా పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాల్సిన అవసరముందని పేర్కొన్నారు. బాలికలపై పెళ్లి ఒత్తిడి ఉందని తెలిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి సమాచారం ఇవ్వాలి. వివరాలు గోప్యంగా ఉంచుతాం ఎవ్వరూ భయపడవద్దు" అని అదనపు కలెక్టర్ చెప్పారు. ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సతీ సహగమనం వంటి సామాజిక రుగ్మతను నిర్మూలించినట్లే బాల్య వివాహాలను కూడా పూర్తిగా నిషేధించడం అవసరమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమం ప్రారంభించి ఏడాది పూర్తయిందని, చత్తీస్‌ఘఢ్‌లోని బలోడ్ జిల్లా ఇప్పటికే బాల్య వివాహ రహిత జిల్లాగా ప్రకటించబడిందని గుర్తు చేశారు. మన పేటను కూడా అలాంటి జిల్లాగా మారిద్దాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమం సిడిపిఓ వెంకటమ్మ ఆధ్వర్యంలో హాజరైన వారందరూ బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. తరువాత అధికారులు, శాఖ సిబ్బంది, పాఠశాలల విద్యార్థినులు కలిసి అంబేద్కర్ చౌరస్తా నుంచి సత్యనారాయణ చౌరస్తా మీదుగా మినీ స్టేడియం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శెట్టి వెంకటేష్, డిపిఆర్ఓ రషీద్, డిసిపివో కరిష్మా, సీనియర్ అసిస్టెంట్ విద్యా ప్రకాష్, ఈఓ శ్రీలత, సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ నరసింహులు సఖీ కేంద్ర అడ్మిన్ క్రాంతిరేఖ, జెండర్ స్పెషలిస్ట్ నర్సింహులు, ఎఫ్ఆర్‌వో సాయి, శాఖ సిబ్బంది లక్ష్మీకాంత్, వెంకట్, గణేష్, నరేష్, సూపర్‌వైజర్లు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి : ఎన్నికల పరిశీలకురాలు



కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకురాలు ఎ. సీతాలక్ష్మి

**నారాయణ పేట, నవంబరు 27 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎ.సీతాలక్ష్మి సూచించారు. ఆమె పేట జిల్లా కలెక్టరేట్‌కు విచ్చేసిన సందర్భంగా స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పూల మొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన పరిశీలకురాలు వాటి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశీలకురాలు తరువాత కొత్తపల్లి మండలం నిడ్జింత, మద్దూరు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు నామినేషన్ ప్రక్రియను ఖచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నామినేషన్ సమయంలో అవసరమైన ధృవపత్రాల సమర్పణపై అభ్యర్థులకు స్పష్టత ఇవ్వాలి. ఫారాలను ఒకసారి పరిశీలించి తప్పులుంటే వెంటనే సరిదిద్దుకునే అవకాశం కల్పించాలి"అని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శెట్టి వెంకటేష్, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## దీక్షా దివస్ పోస్టర్లను ఆవిష్కరించిన బాసు హనుమంతు నాయుడు




పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న బాసు హనుమంతు నాయుడు

**గద్వాల టౌన్,నవంబర్27, ప్రభాతవార్త:** పట్టణంలోని జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగముల నాయకులతో కలిసి దీక్షా దివస్ పోస్టర్లను బాసు హనుమంతు నాయుడు ఆవిష్కరించారు. గురువారం బి.ఆర్.యస్, బి.ఆర్.యస్.వి నాయకులు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనగా గద్వాల నియోజక వర్గ బిఆర్ యస్ పార్టీ ఇంచార్జీ బాసు హనుమంతు నాయుడు దీక్ష దివాస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మోనేష్,రజిని బాబు, ముని మోర్య,గంగాధర్,అంజి,గోపి,రాము,నాగరాజు,రవి,రమేష్, మధు,బి.ఆర్.ఎస్.వి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పాలన అధికారుల రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం



మట్ట చంద్రశేఖర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**వెల్దండ, నవంబర్ 27 ప్రభాతవార్త:** ఇటీవల గ్రామ పాలన అధికారుల రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన గ్రామ పాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న మట్ట చంద్రశేఖర్‌గౌడ్‌ను గురువారం వెల్దండ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా యెన్నం భూపతిరెడ్డి మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించి కృషిచేసి రాబోయే రోజుల్లో మరింత ఉన్నత పదవులు చేపట్టాలని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, క్యాసారపు వెంకటయ్య, భయ్య మల్లయ్య, భరత్ గౌడ్, శివతో పాటు తదితరులు ఉన్నారు.

## గుట్కా ప్యాకెట్ల పట్టివేత

**మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి**

**మక్తల్ టౌన్, నవంబరు 27 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణ కేంద్రంలో ఆలంపల్లి రంగనాథ్ అనే వ్యక్తికి చెందిన కిరాణా షాపులో అంబర్ జర్ద గుట్కా ప్యాకెట్లను నిల్వ ఉంచి ప్రజలకు అమ్ముతున్నారన్న పక్కా సమాచారంతో టాస్క్ ఫోర్స్ మక్తల్ పోలీసులు దాడులు నిర్వహించి రూ. 31,470ల విలువ గల గుట్కా ప్యాకెట్లను పట్టుకొని పోలీస్ స్టేషనుకు తరలించి ఆలంపల్లి రంగనాథ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి తెలిపారు.

## వరి కొనుగోలు అదనపు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**ఊట్కూర్, నవంబరు 27 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండల పరిధిలోని అవుసలోనిపల్లి గ్రామంలో వరి కొనుగోలు కోసం అదనపు కేంద్రాన్ని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.శ్రీను ఆదేశాల మేరకు ఏర్పాటు చేశారు. గతంలో పెద్దజట్రం గ్రామంలోనే వరి కొనుగోలు కేంద్రం ఉండడం వల్ల అవుసలోనిపల్లి రైతులు రవాణా, వ్యయభారం వంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ రైతులు అదనపు రెవిన్యూ కలెక్టర్‌కు అర్జీ ఇవ్వగా వెంటనే స్పందించిన ఆయన వరి కొనుగోలు కేంద్రాన్ని అవుసలోనిపల్లిలో ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదనపు కొనుగోలు కేంద్రాన్ని ఏఇఓ స్వప్న, పెద్దజట్రం క్లస్టర్ అధికారి విద్యాసాగర్, మండల భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షులు ప్రవీణ్ కాంత్, వెంకటయ్య, సాయిబాబా, నర్సిములు, వడ్డేమాన్ బాబురెడ్డి, వడ్డేమాన్ లక్ష్మారెడ్డి ప్రారంభించారు. కేంద్రం ఏర్పాటు కావడంతో గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం పెద్దజట్రానికి ధాన్యం తీసుకెళ్లడం చాలా కష్టంగా ఉండేది. ఇప్పుడు గ్రామంలోనే కేంద్రం ఉండడం పెద్ద ఉపశమనం" అని రైతులు తెలిపారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

**వనపర్తి, నవంబరు 27 ప్రభాతవార్త:** జిల్లాలో గ్రామ పంచాయతి ఎన్నికలు సజావుగా పారదర్శకంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఎన్నికల ప్రవర్తన నియమావళి పరిశీలకులు మల్లయ్య బట్టు కోరారు. వనపర్తి జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా, సవ్యంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మల్లయ్య బట్టు, మేనేజింగ్ డైరెక్టర్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఫోన్ నెంబర్ 9110526278ను వనపర్తి జిల్లా సాధారణ పరిశీలకులుగా నియమించగా ఎన్నికల వ్యయ పరిశీలకులుగా యం. శ్రీనివాసులు, జిల్లా ఆడిట్ ఆఫీసర్, నాగర్ కర్నూల్ ఫోన్‌నంబర్ 8712475079 ను నియమించడం జరిగింది. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి ఆధ్వర్యంలో నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణములో ఎలాంటిప్రలోభాలకుతావు లేకుండా పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు, ఎన్నికల సిబ్బంది అలసత్వానికి తావు లేకుండా కృషి చేయాలని సూచించారు. ఉదయం వీరయపల్లి, పెద్దమందడి గ్రామాలలో నిర్వహిస్తున్న నామినేషన్ ప్రక్రియను పరిశీలించడం జరిగిందని, అన్ని సజావుగా ఏర్పాట్లు చేయడం జరిగిందని సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రజలకు ఏమైనా ఫిర్యాదులు ఉంటే కలెక్టరేట్ కంట్రోల్ రూం 08545233525 నెంబరు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలియజేశారు. వ్యయ పరిశీలకులు శ్రీనివాసులు మాట్లాడుతూ అభ్యర్థులు ప్రచారానికి చేసే ప్రతి పైసా షాడో టీమ్ ద్వారా లెక్కింపు చేయడం జరుగుతోందని అన్ని మండలాల్లో ఎఈఓలను నియమించడం జరిగిందని ఖర్చుకు సంబంధించిన వివరాలు ఏ రోజుకారోజు ఎఈఓలకు పంపించాలని సూచించారు. 50 వేల కంటే ఎక్కువ మొత్తంలో డబ్బులు,లిక్కర్ పట్టుబడితే సీజర్ టీమ్‌కు అప్పగించాలని సూచించారు. జిల్లాఎస్పీ డి.సునీత మాట్లాడుతూ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఇప్పటికే సమన్వయ సమావేశం నిర్వహించుకోవడం జరిగిందని, 3ఎఫ్ఎస్‌టి, 3ఎస్ఎస్‌టి బృందాలతో పాటు 4చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లుతెలియజేశారు. సమస్యాత్మక, సున్నితమైన, పోలింగ్ కేంద్రాలను రెవెన్యూ అధికారుల సహాయంతో గుర్తించడం జరిగింది. ఎక్కడ సమస్యలు ఉత్పన్నం కాకుండా కట్టుదిట్టంగా భద్రత చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎన్నికల పరిశీలకులు, జిల్లా ఎస్పీ ఎఫ్ఎస్‌టి., ఎస్ఎస్‌టి వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు.



ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి వాహనాలకు జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్



నోడల్ అధికారులతో సమావేశమైన కలెక్టర్

## ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసుకోవాలి



ఇందిరమ్మ ఇండ్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

**మద్దూరు, నవంబరు 27 ప్రభాతవార్త:** మద్దూరు మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను స్వయంగా సందర్శించి మంజూ రైన ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపా యాలను సమయానికి వినియోగించుకోవాలని, పనులు నిల్వ ఉండకుండా చూసుకోవాలని లబ్ధిదా రులకు సూచించారు. అదే సమయంలో పోలీస్ స్టేషన్ కాంపౌండ్ పరిధిలో అక్రమంగా నిర్మాణం లో ఉన్న కాంపౌండ్ వాల్‌ను వెంటనే ఆపాలని సంబంధిత వారికి కమిషనర్ హెచ్చరించారు. మున్సిపాలిటీ అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలను చేపట్టరాదని స్పష్టం చేశారు. ఈ కార్య క్రమంలో వార్డ్ ఆఫీసర్ కె.రావుల కన్నా, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## నామినేషన్ల పరిశీలన చేసిన రాష్ట్ర అబ్జర్వర్ శ్వేతా లక్ష్మి



నామినేషన్ల పరిశీలన కార్యక్రమాన్ని పరిశీలించిన రాష్ట్ర అబ్జర్వర్ శ్వేతా లక్ష్మి

**మద్దూరు, నవంబరు 27 ప్రభాతవార్త:** మద్దూరు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం నామినేషన్ల పరిశీలన కార్యక్రమాన్ని రాష్ట్ర అబ్జర్వర్ శ్వేతా లక్ష్మి, జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా,ఎన్నికల నియమావళి ప్రకారం కొనసాగుతున్నాయో లేదో విపులంగా సమీక్షించారు. నామినేషన్ పత్రాల పరిశీలన, రికార్డుల తనిఖీ, పద్ధతుల అమలు వంటి అంశాలను అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామన్న, నటరాజ్, పంచాయతీ కార్యదర్శి సాయి కుమార్‌తో పాటు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## నేడు బీజేపీ ముఖ్య నాయకుల సమీక్ష సమావేశం

**నర్వ, నవంబరు 27 ప్రభాతవార్త:** నేడు ఉదయం 11 గం.లకు నర్వ మండల కేంద్రంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి ఫామ్ హౌస్ దగ్గర బిజెపి ముఖ్య నాయకుల సమావేశం ఉంటుందని బిజెపి నర్వ మండల అధ్యక్షుడు టి.అజిత్ సింహ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశం స్థానిక సంస్థలఎన్నికల గురించి చర్చించేందుకు నిర్వహించడం జరుగుతుంది. కార్యక్రమానికి బీజేపీ నారాయణపేజిల్లా అధ్యక్షులు సత్యా యాదవ్, నాగురావ్ నామాజీ, జిల్లా ఉపాధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు, నియోజక వర్గనాయకులు ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారు. నర్వ మండల బిజెపి ముఖ్య నాయకులు,బూత్ అధ్యక్షులు, ఆయా గ్రామాల ముఖ్య నాయకులు, మండలంలోని అన్ని గ్రామాల బిజెపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## ఈవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ దగ్గర భద్రత పెంచాలి : జిల్లా కలెక్టర్



ఈవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ దగ్గర కలెక్టర్ సంతోష్

**గద్వాల టౌన్ నవంబర్ 27, ప్రభాతవార్త:** ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల గోదాములో ఎలక్ట్రిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎం) లు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ను జిల్లా కలెక్టర్ సంతోష్ గురువారం సంబంధిత అధికారులు,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనఖీలో భాగంగా కలెక్టర్ ఈ తనిఖీ నిర్వహించారు. గద్వాల జిల్లాకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ తో పాటు భద్రత నిర్వహణను పరిశీలించారు.ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.స్ట్రాంగ్ రూమ్ భద్రతలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గద్వాలతహసిల్దార్ మల్లికార్జున్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి

### సాధారణ ఎన్నికల పరిశీలకురాలిని కలిసిన ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 27 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్ వెల్లడించారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ జిల్లాకు చేరుకున్న ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కాత్యాయిని దేవిని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో జిల్లా ఎస్పీ డి. జానకి మర్యాదపూర్వకంగా కలిసి ఎన్నికల ఏర్పాట్లు, భద్రతాచర్యలను వివరించారు.అనంతరం జిల్లా ఎస్పీ అల్లిపూర్ గ్రామ పంచాయతీ నామినేషన్ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి పరిస్థితులు, భద్రతా బందోబస్తు, పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ వెంట మహబూబ్‌పగర్ రూరల్ ఎస్సై విజయ్ ఉన్నారు.

# ఎన్నికల నిబంధనలను విధిగా పాటించాలి

- ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి
- మొదటి విడత ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్27 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన 151 సర్పంచులు, 1326 వార్డు మెంబర్ల స్థానాలకు నామినేషన్ ప్రక్రియ నోటీస్ విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు.గురువారం జిల్లా ఎన్నికల అథారిటీ, కలెక్టర్ బాదావత్ సంతోష్ తాడూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తాడూరు గ్రామ సర్పంచ్, 12 వార్డులకు సంబంధించిన రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో చేపడుతున్న నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ఆరా తీసి, ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడతలో ఎన్నికలు నిర్వహించాల్సిన గ్రామపంచాయతీల సర్పంచులు వార్డు సభ్యుల స్థానాలకు డిసెంబర్ 11న ఎన్నికలు నిర్వహించబడతాయని కలెక్టర్ తెలిపారు. తాడూరు, తెలకపల్లి, కల్వకుర్తి, ఊరుకొండ,వెల్దండ, వంగూరు మండలాల్లని నామినేషన్ల ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి అయ్యాయని వివరించారు.ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయబడింది. నేటి ఉదయం 10:30గంటల నుండి నవంబర్ 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించబడతాయని, పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ప్రతిపాదకుడి సాయం మరియు నిర్ణీత రుసుము చెల్లించి నామినేషన్ దాఖలు చేయాలని సూచించారు. నవంబర్ 30న స్క్రూటినీ నిర్వహించి సాయంత్రం 5 గంటలకు చెల్లుబాటు అయ్యే నామినేషన్ల జాబితా ప్రకటించబడుతుందని నామినేషన్లు తిరస్కరణకు గురైన వారు, డిసెంబర్ 1వ తేదీ న ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్లపై అప్పీల్ చేసుకోవడానికి అవకాశం కల్పించడం అయిందన్నారు.

డిసెంబర్ 3వ తేదీన మధ్యాహ్నం 3గంటలవరకు నామినేషన్ల ఉపసంహరణ జరుగుతుంది మరియు అదే రోజున పోటీదారుల తుది జాబితా విడుదల అవుతుంది.డిసెంబర్ 11న గ్రామపంచాయతీల మొదటి విడత ఎన్నికలు ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం 2:00 గంటల నుండి ఓట్ల లెక్కింపు చేసి ఫలితాలు ప్రకటించబడతాయని, అదే రోజు వార్డు సభ్యులందరూ అందుబాటులో ఉంటే ఉపసర్పంచ్ ఎన్నికను నిర్వహించబడుతుందని, లేనిపక్షంలో మరుసటి రోజు నా ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయడం జరుగు తుందని కలెక్టర్ తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛగా నిర్భయంగా ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగిం చుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు.జిల్లా కలెక్టర్ వెంట ట్రైనీడిప్యూటీ కలెక్టర్లు అశోక్, హర్షవర్ధన్, తాడూరు మండల తహసిల్దార్, ఎంపీడీవో, ఇతర అధికారులు ఉన్నారు .

# రైతుల గోస వినిపించుకునేది ఎవరు..?

- నెల రోజులకు పైగా కొనుగోలు కేంద్రాలలోనే వరి ధాన్యం
- పట్టించుకోని సివిల్ సప్లయ్ అధికారులు
- బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్

**వనపర్తి, నవంబరు27 ప్రభాతవార్త:** ఆరుగాలం శ్రమించి పండించిన పంట నెలరోజులకు పైగా కొనుగోలు కేంద్రాలలో మగ్గుతున్నా రైతులు పడుతున్న గోస ఎవరికి పట్టడం లేదని బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వనపర్తి మండలం అంకూర్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అధికారులు ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు పడుతున్న ఇబ్బందులను కళ్ళు తెరిచి చూడాలన్నారు. కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు పడిగాపులు కాస్తూ తీవ్ర సమస్యలతో అక్కడే ఉండాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ లావురకం వడ్లను దించుకోకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లయ్ అధికారుల నిరక్ష్యం కారణంగానే



కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న రాచల



వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న రాచాల బృందం

రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇది మళ్ళీ పునరావృతం అయితే రోజుకో ఎపిసోడ్ మాదిరిగా అధికారుల లీలలు బయట పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతుల దీనస్థితి ఏ పార్టీ నాయకుడికి పట్టడం లేదని, రైతులను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నారని,రైతులు పండించిన ధాన్యం కల్లాల్లోనే మగ్గుతుంటే అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు కళ్ళు మూసుకున్నారా అంటూ ప్రశ్నించారు. మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ జిల్లా అధికార యంత్రాంగంతో చేసిన సమీక్ష సమావేశం కేవలం నీటిమీద బుడగ లాగే మారిందన్నారు. తరుగు పేరుతో రైతులను నిలువు దోపిడీ చేస్తుంటే పట్టించుకునే నాధుడే లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ కలుగజేసుకుని రైతులు పడుతున్న గోసను వెంటనే తీర్చాలని, లేదంటే బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి వనపర్తి అద్యక్షులు దేవర శివ, నాయకులు వివి గౌడ్, అంజన్న యాదవ్, ధర్మేంద్ర సాగర్, రాఘవేందర్ గౌడ్, అస్కని రమేష్, రామన్ గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వివాదాల పోస్టులు పెడితే కఠిన చర్యలు

### ఆత్మకూరు ఎస్సై జయన్న


**ఆత్మకూర్ నవంబర్27,ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రస్తుతం గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సోషల్ మీడియా లో వివాదాల పోస్టులు పెడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు ఎస్సై జయన్న హెచ్చరించారు. గురువారం రోజు ఆత్మకూరులోని పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఎస్సై విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికలకోడ్ నేపథ్యంలో గ్రామాలలోప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని అంతేకాకుండా సోషల్ మీడి యాలో గ్రూప్ అడ్మిన్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సోషల్ మీడియాలో మతపరమైన మరియు వివాదాస్పద పోస్టులు పెడితే గ్రూప్ అడ్మింటే బాధ్యత వహించవలసి ఉంటుందని ఆయన అన్నారు. ఆత్మకూరు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఐదు గ్రామాలనుసమస్య ఆత్మక గ్రామాలుగా గుర్తించామని మండలంలోని పిన్నంచెర్ల మరియు జూరాల, మూలమల్ల రేచింతల గ్రామాలను సమస్య ఆత్మక గ్రామాలుగా గుర్తించామని ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకు ఆయా గ్రామాల్లో ఎలాంటి సమా వేశాలు నిర్వహించాలన్న పోలీసుశాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఆయన సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల ముగిసే వరకు ఆయారాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు తమ పార్టీ కార్యకర్తలపై తగు జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా పోలీసు శాఖకుసహాయసహకారాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

**లింగాల, నవంబరు27 ప్రభాతవార్త:** విద్యార్థుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంఈఓ బషిర్ అహ్మద్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం లింగాల మండల పరిధిలోని పిఎస్ అంబట్ పల్లి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన పలు రకాల రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో ప్రతి ఉపాధ్యాయుడు టీచింగ్ డైరీ ప్రకారం విద్యాబోధన చేయాలని సూచించారు. ఈ నెల 30లోపు మిడ్‌లైన్ టెస్ట్ నిర్వహించాలని కోరారు.విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఇందిరమ్మ, ఉపాధ్యాయులు మల్లిఖార్జున్ పాల్గొన్నారు.



అంబట్‌పల్లి పిఎస్ పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ బషిర్ అహ్మద్



విరాళం రసీదును అందజేస్తున్న మాజీ మున్సిపల్ ఛైర్మన్ వేణుగోపాల్

## శివాలయ నిర్మాణానికి రూ.75వేల విరాళం

**గద్వాల టౌన్ నవంబర్27, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నల్లకుంట శివాలయం గుడి పునర్నిర్మాణంలో భాగంగా మాజీ మున్సిపల్ ఛైర్మన్ జి. వేణుగోపాల్ 75వేల విరాళాన్ని అందజేశారు. గురువారం విరాళం సేకరణలో భాగంగా విరాళం రాసిన దాతలలో వేణుగోపాలుతో పాటు, అల్లపాడు శ్రీధర్‌గౌడ్ 25 వేల విరాళం ఇచ్చినట్టు శివాలయం కమిటీ చైర్మన్,మాజీ కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్, గుమ్మడం గోపాల్, వెంకట్రాములు,కోశాధికారి శాసనూరు నాగరాజు శెట్టి, కటిక బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా అందరికి ఇవ్వాలి

**ఊట్కూర్, నవంబరు 27 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం యాసంగి సీజన్‌లో శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు విస్తీర్ణం లెక్కించి,రబీ సీజన్‌లో పంటలు వేసిన వారికి మాత్రమే రైతు భరోసా అందించాలనే ఆలోచన సరైనది కాదని సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహా ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తమ శాఖకు న్యాయం చేస్తున్నారని అభినందించిన ఆయన,రైతులకు రబీ సీజన్‌కే పరిమితమైతే అది అన్యాయం అవుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోఅనేక జిల్లాల్లో సాగునీరు లేక రైతులు వర్షంపై ఆధారపడి పంటలు వేస్తున్నందున, ఖరీఫ్ రబీ రెండు సీజన్లలో కూడా రైతు భరోసా ఇవ్వాలని ఆయన కోరారు. ప్రభుత్వానికి ఆర్థిక భారమైతే, వందల ఎకరాలు సాగు చేసినా గరిష్ఠంగా 5 ఎకరాల వరకు మాత్రమే రైతు భరోసా పరిమితం చేయాలని సూచించారు. అలాగే వరి ధాన్యానికి సంచులు, సమయానికి సరఫరా చేసి, వడ్ల కొనుగోలు ప్రక్రియలో రైతులకుఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

## కాంగ్రెస్ పార్టీ నర్వ మాజీ టౌన్ అధ్యక్షుడు రాజీనామా..



రాజీనామా లేఖలను అందజేసిన దృశ్యం

**నర్వ, నవంబరు 27 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ నర్వ టౌన్ విభాగం మాజీ అధ్యక్షుడు వి. వేంకటేశ్వర్ రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. పార్టీకి పని చేసిన అభ్యర్థులను విస్మరించడం తగిన గుర్తింపు ఇవ్వకపోవడమే కారణమని తెలిపారు. మక్తల్ నియోజకవర్గం నర్వ మండలం కాంగ్రెస్ పార్టీ నర్వ మాజీ టౌన్ ప్రెసిడెంట్ వావిళ్ల వెంకటేశ్వర రెడ్డి గత 15 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో పని చేసారు. మక్తల్ నియోజక వర్గం యువజన కాంగ్రెస్ కార్యదర్శి పాతర్చేడ్ రామన్ గౌడ్ సైతం గత కొన్ని సంవత్సరాలుగా పార్టీ కొరకు పని చేశారు. కానీ పార్టీలో తగిన గుర్తింపు లేదని ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చలేక పోతున్నామని పార్టీ ప్రాథమికసభ్యత్వానికి టౌన్ అధ్యక్ష పదవికి, నియోజక వర్గ యువజన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్టు వీరిరువురుజిల్లా అధ్యక్షుల వారికిరాజీనామా లేఖను ఇచ్చినట్లు తెలిపారు.

## ఘనంగా క్రీడలు ప్రారంభం



క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

**నారాయణ పేట, నవంబరు 27 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రం లోని పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో గేమ్స్ అండ్ స్పోర్ట్స్ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి ఈ క్రీడలను పీడీ అక్తర్ పాషా ప్రారంభించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ పాఠశాల హెడ్‌మాస్టర్ దత్తురావు స్టాఫ్ సభ్యులు అభినందనలు తెలిపారు. క్రీడా కార్యక్రమాలలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ వంటి క్రీడలు ప్రారంభించబడ్డాయి. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది. పాఠశాలస్థాయిలో మొదలైన ఈ క్రీడలు తదుపరి మండల స్థాయి జిల్లా స్థాయిలో విస్తృతంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనగా, ఉపాధ్యాయులు వారిని ఉత్తేజపరిచారు.

## మా కాలనీ వద్ద వైన్స్ వద్దు

- ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్న భగీరథ కాలనీ మహిళలు

**మహబూబ్‌నగర్, నవంబరు 27 ప్రభాతవార్త:** తమ కాలనీలో వైన్ షాప్ పెట్టొద్దని, చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని మహిళలు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్, భూత్పూర్ ప్రధాన రహదారిపై భగీరథ కాలనీలో వైన్ షాప్ ఏర్పాటు చేయద్దని కాలనీ మహిళలు ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మహబూబ్‌నగర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. వైన్ షాప్ ఏర్పాటు వల్ల మహిళలు రోడ్డుపై తిరగలేక పోతున్నారని పార్కింగ్‌కు కూడా ఇబ్బంది ఏర్పడుతుందని మహిళలు ఎమ్మెల్యేకు వివరించారు. కాలనీకి దూరంగా ఎక్కడ పెట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని ఎమ్మెల్యే ఈ విషయంలో తమకు సహకరించాలని కోరారు.

## రేపు ఐజెయు జిల్లా మహాసభ

- హాజరుకానున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ
- మండలాల నుంచి ప్రతి సభ్యుడు తరలిరావాలి
- మహాసభ కన్వీనర్ కేప విజయరాజు వెల్లడి



మాట్లాడుతున్న కన్వీనర్ విజయ రాజు

**మహబూబ్‌నగర్, నవంబరు 27 ప్రభాతవార్త:** ఈనెల 29న టియుడబ్ల్యూ జే (ఐజేయు) మహబూబ్‌నగర్ జిల్లా మహాసభలు భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని మహాసభల కన్వీనర్ కేప విజయ రాజు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మహాసభకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ తో పాటు మహబూబ్‌నగర్ జిల్లాలోని ముగ్గురుఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జి.మధుసూదన్ రెడ్డి, జనుంపల్లి అనిరుద్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డితో పాటు ఇతర రాజకీయ ప్రముఖులు కూడా హాజరవుతున్నట్లు వెల్లడించారు.ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత నిర్వహించే మూడవ జిల్లా మహాసభను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శివం కన్వెన్షన్ హాల్లో ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రతి మండలంనుంచి యూనియన్‌సభ్యులు ప్రతి ఒక్కరు తరలి వచ్చి మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలోసీనియర్‌జర్నలిస్టులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## చిన భీమరాయుడిది హత్యే...

మొదటి పేజీ తరువాయి భాగం..

నుంచి 8,50,000 రూపాయలు, 4కార్లు, 1బొలేరో, 2బైక్‌లు, 11 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.రిమాండ్‌కు తరలించిన వారిలో మిల్లు వీరన్న,కుర్వ సురేందర్, బోయ వీరన్న, తెలుగు మధు బాబు, తెలుగు కృష్ణ, సంజీవులు, బైరీ సుంకన్న, బైరీ కేశన్న, ప్రభుస్వామి,హరిజన్ రాజేశ్ ఉండగా, కర్నూల్ జిల్లాకు చెందిన ఈశ్వరయ్యగౌడ్ పరారిలో ఉన్నారన్నారు. పరారీలో వున్న వ్యక్తిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

## గ్రామాల్లో జీపీ ఎన్నికల హడావుడి

(మొదటి పేజీ తరువాయి)

కేటాయించిన కోటాలో తమ అభ్యర్థిత్వాన్ని నిలిపేందుకు స్థానిక నాయకులు,ఆశావహులు స్థానిక సంస్థల ఎన్నికల్లో ముఖ్యంగా సర్పం చ ఎన్నికల్లో తమ సత్తా చాటేందుకు ఆయా పార్టీల అధినేతలు,స్థానిక ప్రజాప్రతినిధులు,ఎమ్మెల్యేలు,ఎంపీలతో మంతనాలు సాగిస్తూ తమ ప్రాబల్యం చాటేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.సర్పంచు ఎన్నికలు పార్టీ గుర్తుల ప్రకారంగా కాకుండా పరోక్షంగా నిర్వహిస్తుడడంతో స్థానిక నాయకులు ప్రభావం ఈ స్థానిక ఎన్నికలలో ఉంటుందని భావిస్తున్నారు.ఏదేమైనా మరో నెలలో జరిగే సర్పంచు ఎన్నికలకు స్థానిక నాయకులు సన్నద్ధ మౌతున్నారని చెప్పక తప్పదు.రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టాక స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సర్పంచులు,వార్డు సభ్యులకు అధికార పార్టీ నుంచే అధిక స్పర్థ ఉండవచ్చుని పలువురు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

## శాంతిభద్రతలపై కఠిన పర్యవేక్షణ...!!



మొదటి విడత నామినేషన్ కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

(మొదటి పేజీ తరువాయి)

విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో ఎస్పీ ప్రత్యేకంగా మాట్లాడి, ఎన్నికల నియమావళి ప్రకారం నామినేషన్ ప్రక్రియ పూర్తిగా నిష్పక్షపాతంగా, శాంతియుతంగా జరిగేలా పనిచేయాలని పలు సూచనలు చేశారు.ఎలాంటి అవాంఛిత పరిస్థితులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు పారదర్శకమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రతి సిబ్బందిపైన ఉందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలలో శాంతిభద్రతలను కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదు. ఎన్నికల ప్రక్రియను భంగపరచాలని చూస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవు అని స్పష్టం చేశారు. జిల్లాలోని సెన్సిటివ్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ప్రతి పోలింగ్ కేంద్రంలో పకడ్బందీ బందోబస్తు, పెట్రోలింగ్, క్విక్ రెస్పాన్స్ టీంలను సిద్ధంగా ఉంచినట్లు ఎస్పీ తెలిపారు. అక్రమ డబ్బు, మద్యం పంపిణీ, బెదిరింపులు, అనైతిక ప్రలోభాలు వంటి తప్పిదాలు ఎక్కడైనా గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పి వెంకటేశ్వర్ రావు, కొనపర్తి సిఐ కృష్ణయ్య, గోపాల్‌పేట ఎస్సై నరేష్, రేవల్లి ఎస్సై రజిత, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఆకస్మికంగా తనిఖీ



పోల్కంపల్లిలో వరికొనుగోలు కేంద్రం వద్ద రైతులతో ముచ్చటిస్తున్న కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. ఏ ఒక్క రైతు కూడా తమ ధాన్యాన్ని విక్రయించేందుకు రైస్ మిల్లులకు వెళ్లాల్సిన పనిలేదని కలెక్టర్ స్పష్టం చేశారు.ఇంతవరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారని,రైతుల నుంచి కొనుగోలు చేసిన వరిధాన్యాన్ని వెను వెంటనే లోడ్ చేసి సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని కొనుగోలు కేంద్ర నిర్వాహకులనుకలెక్టర్ ఆదేశించారు.వరిధాన్యాన్ని ఎప్పటికప్పుడు తేమశాతం చెక్‌చేయాలని,సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.రైతులకు ఇబ్బంధులు తలెత్తకుండా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు టాబ్ ఎంట్రీలు పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని ఆదేశించారు.ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లను వినియోగించుకుంటున్నారా? అని నిర్వాహకులను ఆడిగి తెల్సుకున్నారు.అన్నాసాగర్‌లో వరి కొనుగోలు కేంద్రంవద్ద కలెక్టర్ విజయేంద్రబోయి రైతులతో మాట్లాడుతూ నిర్ణీత తేమశాతం, తాలు, మట్టిలేకుండా నాణ్యతా ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు కలెక్టర్ సూచించారు.

## కాంగ్రెస్ నేత ఓవరాక్షన్..
## ఎమ్మెల్యే జిఎంఆర్ ఇంటరాక్షన్

(మొదటి పేజీ తరువాయి)

తప్పు ఉన్నావిచారణ చేసి చర్యలు తీసుకోవాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండాలని, పోలీసులు ప్రజల కోసం ఉన్నారని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదన్నారు. జడ్చర్ల పోలీస్ స్టేషనుకు చేరుకున్న డిఎస్పి వెంకటేశ్వర్లు ఘటనపై పూర్తి వివరాలు ఆరా తీశారు. ఈ నెల 16న బురెడ్డిపల్లి వద్ద జరిగిన ప్రమాద ఘటనకు సంబంధించి ఆ కేసులో రాజీ ప్రయత్నంలో మాటల తగవు గొడవకు దారి తీసిందన్నారు. పోలీసులపై దాడి యత్నం స్పష్టంగా కనిపిస్తున్నట్లు సీసీ ఫుటేజ్, సాక్షులు చెబుతున్నారని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జడ్చర్లలో జరిగిన ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.ఎవరికైనా బాధ కష్టం వస్తే పోలీసులకు చెప్పుకుంటారని అలాంటిది పోలీసులపైనే దాడి జరిగితే ఎవరికి చెప్పుకోవాలని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు.

## రైతులకు ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యం కొనుగోలు చేయాలి

◆ జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**ఖిల్లాగణపురం నవంబర్ 27, ప్రభాతవార్త:** వరి కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పర్వతాపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రా న్ని పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలులో తాలు లేకుండా చూడాలని కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి ట్యాబ్ ఎంట్రీని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. రవాణా కాంట్రాక్టర్లు ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలని అలాగే కేంద్రాలను రిజిస్టర్ లను నిర్వహించి సీరియల్ నెంబర్ ప్రకారం ధాన్యాన్ని లిఫ్ట్ చేయాలని చెప్పారు. అనంతరం అదనపు కలెక్టర్ ఘనపురం మండలంలోని లక్ష్మీ వెంకటేశ్వర రైస్ మిల్లును కూడా తనిఖీ చేశారు. మిల్లు కు చేరుకున్న ధాన్యం లోడ్లను పరిశీలించి మిల్లు యజమానులకు పలు ఆదేశాలు జారీ చేశారు. లారీలు ఎక్కువ సమయం మిల్లుల వద్ద ఉంచుకోవద్దని చెప్పారు



కాంటా వేసేవారితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

## సర్పంచ్ అభ్యర్థులుగా 24 మంది నామినేషన్

**వంగూరు, నవంబర్27 ప్రభాతవార్త:** స్థానిక ఎన్నికల బరిలో నిలిచేందుకు వంగూరు మండలంలో 27 గ్రామపంచాయతీలకు గాను 12 గ్రామపంచాయతీలలో 24 మంది సర్పంచు అభ్యర్థులుగా గురువారం మొదటిరోజు తమ నామినేషన్లు దాఖలు చేశారు. వంగూరు మండల కేంద్రంలో 2, మిట్టసదగోడులో1, పోల్కంపల్లిలో1, చౌదర్‌పల్లిలో 4, ఉప్పల్ పహాడ్‌లో 2, వెంకటాపూర్‌లో 1, గాజరలో1, రంగాపూర్‌లో1, కోనాపూర్‌లో2, సర్వారెడ్డిపల్లిలో 2, కోనేటిపూర్‌లో2, సర్వరెడ్డిపల్లి తండాలో 3 నామినేషన్లు సర్పంచ్‌లకు కాగా, మిట్టసదగోడులో 2వార్డు సభ్యులకు నావమినేషన్లు దాకాలు చేసినట్లు ఎంపీడీఓ బ్రాహ్మచారి తెలిపారు.



# మొదటి దశ నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

◆ నామినేషన్లను స్వీకరించిన అనంతరం సాయంత్రం టీ పోల్ యాప్‌లో అప్డేట్ చేయాలి
◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి

**వనపర్తి, నవంబరు 27 ప్రభాతవార్త:** జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల మొదటి దశ నామినేషన్ స్వీకరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా, సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశించారు. గురువారం గ్రామపంచాయతీ ఎన్నికల మొదటి దశలో భాగంగా ఐదు మండలాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావడంతో గోపాల్‌పేట మండల పరిధిలో గోపాల్‌పేట, తాడిపర్తి, బుద్ధారం, పెద్దమందడి మండల పరిధిలో పామిరెడ్డిపల్లి, వీరాయిపల్లి గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. వీరాయపల్లిలోకలెక్టర్‌తో పాటు ఎన్నికలజనరల్ అబ్జర్వర్ మల్లయ్య బట్టు, ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ శ్రీనివాస్, అదనపు కలెక్టర్ స్థానిక



నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్

సంస్థలు యాదయ్య కూడా పాల్గొని నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పరిశీలకులు నామినేషన్ స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల మొదటి దశ నామినేషన్ స్వీకరణ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా, సజావుగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారులకు ఆదేశించారు.నామినేషన్ స్వీకరణ కేంద్రాల్లో ఓటర్ జాబితాను ప్రదర్శించాలనిసూచించారు. అని నామినేషన్ స్వీకరణ కేంద్రాల్లో ఫారం 1 ప్రచురణ చేశారా లేదా అని కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రతిరోజు నామినేషన్లను స్వీకరించిన అనంతరం సాయంత్రం టీ పోల్ యాప్ లో అప్డేట్ చేయాలని సూచించారు. నామినేషన్ దాఖలుచేసే అభ్యర్థితో పాటు ఒక ప్రపోజల్ మరొక వ్యక్తి మొత్తం ముగ్గురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి గదిలోకి అనుమతించాలని సూచించారు. ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ శ్రీనివాస్ మాట్లాడుతూనామినేషన్ వేసినఅభ్యర్థులకు ఎక్స్‌పెండిచర్ బుక్లెట్ ఇచ్చినప్పుడు ధ్రువీకరణ చేసి ఇవ్వాల్సి ఉంటుందని సూచించారు. గోపాల్‌పేట తహసిల్దార్ తిలక్ రెడ్డి, ఎంపీడీవో అయేషా, పెద్దమందడి తహసిల్దార్ పాండు నాయక్, ఎంపీడీవో తాళ్ల పరిణత, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కరపత్రాల ముద్రణలో ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి

**వనపర్తి, నవంబరు27 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రచార పోస్టర్లు, కరపత్రాల ముద్రణలో ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ప్రింటింగ్ ప్రెస్ యజమానులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో ఎన్నికల ప్రవర్తన నియమావళిపై సమావేశం నిర్వహించి ఎన్నికల ప్రవర్తన నియమావళి పై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా కరపత్రాలు, పోస్టర్ల ముద్రణలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాటించాల్సిన నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రచార సామాగ్రి అయిన పోస్టర్లు, కరపత్రాల్లో కులం, మతపరమైన అంశాలను ప్రస్తావించరాదని, అదే విధంగా వ్యక్తిగత విమర్శలు లేకుండా చూసుకోవాలని సూచించారు. పబ్లిషర్ నుండి ఫారం ఎలో డిక్లరేషన్ తీసుకోవాలని, ఫారం ఎ,బితో పాటు ముద్రించిన 2 కర పత్రాలను జతపరచి కలెక్టరేట్ కు పంపించాలని సూచించారు. ముద్రించిన కరపత్రం లేదా గోడ పత్రికపై ప్రింటింగ్ ప్రెస్ పేరు, చిరునామా ఖచ్చితంగా పేర్కొనాలని, అంతేకాకుండా పబ్లిషర్ పేరు ఫోన్ నెంబర్ ముద్రించాలన్నారు. ఎన్ని పేజీలు ముద్రించారు, అందుకు తీసుకున్న పైకం ఎంత అనే వివరాలు ఫారం బిలో చూపెట్టాలని సూచించారు. ప్రింటింగ్ ప్రెస్ యజమానులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా పౌర సంబంధాల అధికారి పి.సీతారాం, సెక్షన్ సూపరింటెండెంట్ మదన్ మోహన్, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

# నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

■ గద్వాల జిల్లా కలెక్టర్ బి. యం. సంతోష్

**గద్వాల టౌన్ నవంబర్27, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామి నేషన్ల స్వీకరణ ఎలాంటి తప్పిదాలకు చోటు లేకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ అన్నారు. గురువారం గద్వాల మండలం పూడూరు గ్రామంలోని, ధరూర్ మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన సర్పంచ్ ఎన్నికల నామినేషన్లను స్వీకరించే కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. పూడూరు తో పాటు ఎర్రవల్లి, మేలచెరువు, కొండపల్లి, రేపల్లె, ధరూర్ కేంద్రంలో ధరూర్ తో పాటు జాంపల్లి, దోర్నాలగ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లను కూడా స్వీకరిస్తుండడం తో ఆయా పంచాయతీల ఓటర్ లిస్టును పరిశీలించారు. పోటీ చేయు అభ్యర్థులు పూరించాల్సిన వివిధ దరఖాస్తులను, నామినేషన్ వేసేందుకు అవసరమైన ఇతర సామాగ్రిని రిటర్నింగ్అధికారులు సిద్ధంగా ఉంచుకోవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా పంచాయతీల కు ఖరారు చేసిన రిజర్వేషన్ల ప్రకారం సంబంధిత వర్గాల అభ్యర్థుల నుంచి నామినేషన్లు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచు, వార్డు సభ్యులు పదవులకు పోటీ చేయు అభ్యర్థులు తమ దరఖాస్తుకు జతపరచాల్సిన వయసు, కుల, ఇతరత్రా ధ్రువీకరణ పత్రాలను నిబంధనల ప్రకారం స్వీకరించాలన్నారు. పోటీ చేయు అభ్యర్థులు గ్రామ పంచాయితీకి చెల్లించాల్సినపన్నులు పెండింగ్లో ఉండకుండా కట్టించుకోవాలన్నారు.నామినేషన్ల డిపాజిట్ స్వీకరించాక రసీదును అందజేయాలన్నారు. నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థితో పాటు ప్రతిపాదించే ఇద్దరినీ మాత్రమే కేంద్రంలోకి అనుమతించాలని, మిగతా వాళ్ళు కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ఉండేలా చూడాలని ఆదేశించారు. సెల్ఫ్ డిక్లరేషన్ ఫామ్‌లో ఉండే అన్ని అంశాలనుఅభ్యర్థులు కరెక్టుగా పూరించేలా అవగాహన కల్పించాలన్నారు. ఆయా నామినేషన్ కేంద్రాల వద్ద హెల్ప్ డెస్కును పరిశీలించి పోటీ చేయు అభ్యర్థులకు అవసరమైన సలహాలనుఇవ్వాలని విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సూచిం చారు. ఈ సందర్శనలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జడ్పి డిప్యూటీ సీఈవో నాగేంద్రం, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




నామినేషన్ దాఖల కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

## ఎన్నికల భద్రతపై రాష్ట్రవ్యాప్తంగా దృశ్య సమీక్ష

■ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని ఎస్పీలకు డీజీపీ ఆదేశాలు

**వనపర్తి, నవంబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, ఆధ్వర్యంలో గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై దృశ్య సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఎన్నికలను పూర్తిగా శాంతియుతంగా, నిఘా లోపం లేకుండా నిర్వహించేందుకు ప్రతి స్థాయి పోలీసు అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని డీజీపీ స్పష్టం చేశారు.




డీజీపీ మాట్లాడుతూ నామినేషన్ దశ నుండి ఫలితాల అనంతరం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్రమశిక్షణతో కూడిన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గత ఎన్నికల్లో నేరాల నేపథ్యం ఉన్నవారు, రౌడీ షీటర్లు, అనుమానితులు, ట్రబుల్ మేకర్స్‌ను వెంటనే బైండోవర్ చేయాలని స్పష్టం చేశారు. మండల/స్టేషన్ వారీగా సమస్యాత్మక, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలు ప్రతి అధికారి పూర్తి అవగాహనతో ఉండాలని చెప్పారు. ఎన్నికల రోజు, కౌంటింగ్ రోజు, ఫలితాల అనంతరం జరిగే విజేత ర్యాలీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలోవనపర్తి జిల్లా ఎస్పీ సునితరెడ్డి పాల్గొని గ్రామ పంచాయతీ ఎన్నికల నేప థ్యంలో జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న భద్రతా చర్యలు, బందో బస్తు ప్రణాళికలు, సున్నిత గ్రామాల పరిశీలన వంటి అంశాలను డీజీపీ కి వివరించారు. ఈ దృశ్య సమీక్ష సమావేశంలో వనపర్తి ఏఆర్ అదనపు ఎస్పి వీరారెడ్డి, వనపర్తిడిఎస్పి వెంకటేశ్వర్‌రావు, డిసిఆర్బి డిఎస్పీబాలాజీ నాయక్, వనపర్తి సిఐ కృష్ణయ్య, కొత్తకోట సిఐరాంబాబు, ఆత్మకూరు సీఐ శివకుమార్, రిజర్ ఇన్స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, జిల్లాలోని ఎస్సైలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దృశ్య సమీక్షలో పాల్గొన్న జిల్లా ఎస్పీ పోలీసు అధికారులు

## సీఎం పర్యటనకు భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

**మక్తల్ టౌన్, నవంబరు 27 ప్రభాతవార్త:** డిసెంబర్ 01 తేదీన మక్తల్ పట్టణ కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్న సందర్భంలో, అధికారులు భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఎండీ రియాజ్, డిఎస్పీ నల్లపు లింగయ్య, సిఐ రామ్ లాల్, అదనపు కలెక్టర్ శ్రీను (రెవెన్యూ)లు కలిసి మక్తల్ టౌన్‌లోని ముఖ్యమంత్రి సమావేశ వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలు, ప్రజా రాకపోకల మార్గాలను సందర్శించారు. అధికారులు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవలు, పోలీసులు ముందస్తు తీసుకోవలసిన చర్యలు, ప్రజలు రాకపోకల కోసం అవసరమైన ఏర్పాట్లపై సూచనలు చేశారు. ముఖ్యంగా సమావేశ ప్రాంగణం చుట్టుపక్కల అదనపు బందోబస్తు, రూట్ మ్యాప్, పార్కింగ్ లైన్లు, హెలిప్యాడ్ వద్ద సెక్యూరిటీ వంటి అంశాలను ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. సీఎం పర్యటనను శాంతియుతంగా, సమగ్ర భద్రతా ప్రమాణాలతో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు.



## ఆత్మకూర్ బిజెపి అధ్యక్షులుగా మండల సురేష్

**ఆత్మకూర్ నవంబర్ 27, ప్రభాతవార్త;** మక్తల్ నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలం మున్సిపాలిటీ పట్టణ బిజెపి అధ్యక్షులుగా పట్టణానికి చెందిన మండల సురేష్‌ను ఏకగ్రీవంగా నియమించినట్లుగా ఆత్మకూరు మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అశ్విన్ కుమార్ ప్రభాతవార్తకు తెలిపారు. గురువారం రోజు నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగిన బిజెపి జిల్లా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆత్మకూరు పట్టణ అధ్యక్షులుగా మండల సురేష్, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, పులిపాటి రమేష్,ఎంఎ తదితరులను నారాయణపేట జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్ అధికారికంగా ప్రకటించినట్లుగా అశ్విన్ కుమార్ ప్రభాతవార్తకు తెలిపారు.ఇదిలా ఉండగా ఆత్మకూర్ పట్టణ బిజెపి అధ్యక్షులుగా నియమితులైన మండల సురేష్ మాట్లాడుతూ పట్టణంలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి గెలుపు కోసం పార్టీలోని కార్యకర్తలందరితో కలిసిమెలిసి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన అన్నారు.

## శాంతి పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలి



**నారాయణ పేట, నవంబరు 27 ప్రభాతవార్త :** స్తానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎస్పీలు కమిషనర్లు, పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎస్పీ డా. వినీత్, డీఎస్పీ నల్లపు లింగయ్యతో పాటు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో చట్టం శాంతి పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని డిజిపి ఆదేశించారు. డబ్బు లేదా మద్యం పంపిణీ, బెదిరింపులు వంటి చట్టవిరుద్ధ చర్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతను బలోపేతం చేయాలని, సున్నిత ప్రాంతాల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.అలాగే మొబైల్‌పార్టీలు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రౌడీ షీటర్లపై నిఘా వహించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగేందుకు పోలీసులు అత్యంత బాధ్యతతో పనిచేయాలని డిజిపి స్పష్టం చేశారు.

## నామినేషన్ దాఖలు చేసిన కొత్తపల్లి సర్పంచ్ అభ్యర్థి



నామినేషన్ దాఖలు చేస్తున్న కొత్తపల్లె సర్పంచ్ అభ్యర్థి ఏ. సుజాత

**గద్వాల టౌన్ నవంబర్ 27, ప్రభాతవార్త:** కొత్తపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి గా ఏ.సుజాత గురువారం నామినేషన్ దాఖలు చేశారు. కొత్తపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి స్థానం బీసీ మహిళకు కేటాయించగా గ్రామం నుండి ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఏ.సుజాత సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. గ్రామానికి చెందిన అశోక్‌రెడ్డి బలపరచగా కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు వారు తెలిపారు.

# పంచాయతీలో పట్టుకై సమర్థుల కోసం వేట

● గ్రామాలలో ఆశావహుల పేర్లు సేకరణ  ● స్థానిక పోరు పై గ్రామాలలో చర్చ

**చిన్న చింతకుంట, నవంబరు 27 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో పల్లె పోరుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడంతో మండలంలోని గ్రామాలలో స్థానిక పోరుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఆశావాహుల వేటలో పడ్డారు. మండలంలోని 18 గ్రామపంచాయతీలో రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆయా రిజర్వేషన్లకు అనుగుణంగా ప్రజా మన్నన పొందిన నేతలను వెతికే పనిలో రాజకీయ పార్టీల నేతలు వరుస సమావేశాలను నిర్వహిస్తున్నారు. పంచాయతీ పోరులో పట్టు సాధించేందుకు సమర్థులను రంగంలో దింపేందుకు గ్రామాలలో ఆశావాహుల పేర్లను సేకరిస్తున్నారు. జనరల్, బిసి రిజర్వేషన్ లో ఉన్న గ్రామాలలో ఎన్నికల సందడి రసవత్తరంగా ఉంది. ఎస్సీ రిజర్వేషన్లు ఉన్న గ్రామాలలో సర్పంచ్‌గా పోటీ చేయాలని ఆశించిన బీసీ, జనరల్ నేతలు ఆశలు అడియాసలయ్యాయి. చిన్న చింతకుంట, నెల్లికొండి, ఉంద్యాల గ్రామాలకు ఎస్సీ రిజర్వేషన్లు ఖరారు కావడం తో ఎస్సీ వర్గానికి చెందిన ఆశావాహులను సేకరించే పనిలో ప్రధాన పార్టీల నేతలు సమావేశాలను నిర్వహిస్తున్నారు. జనరల్, బిసి రిజర్వేషన్లు ఖరారు అయిన గ్రామాలలో స్థానిక పోరు వేడి పుట్టిస్తుంది. అధికారపక్షం అభ్యర్థిని ఖరారు చేశాకే తమ అభ్యర్థిని ఖరారు చేద్దామని వేచి చూస్తున్నాయి. ప్రతిపక్షాలు, ఏది ఏమైనా గ్రామాలలో పల్లె పోరుపై ఏ నలుగురు వ్యక్తులు కలిసిన చోట పంచాయతీలో పోటీ చేసేవారిపైనే చర్చించుకుంటున్నారు. చిన్న చింతకుంటమండలం రెండో దశలో ఎన్నికలు నిర్వహించేం దుకు రాష్ట్రఎన్నికల సంఘం ప్రకటించడంతో ఈ నెల 30న నామినేషన్ పర్వం కొనసాగనుంది. డిసెంబర్ 14న ఎన్నికలు జరగనున్నాయి పంచాయతీలో పట్టుసాధించేందుకు అన్ని రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. జనాకర్షణ నేత, ప్రజలలో మంచిపేరు,పార్టీకొరకు అంకితభావంతో పనిచేసేఆశా వాహులనువెతికే పనిలో అన్నిరాజకీయ పక్షాలు రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ రెండు రోజులలో సర్పంచ్, వార్డులకు పోటీ చేసే ఆశావాహుల పేర్లు వెల్లడికానున్నాయి. అంతవరకు వేచి చూద్దాం.

